## • ఐదు నెలలుగా జీతాలేవీ?




పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా నందిపేట్‌లో ఐలమ్మ విగ్రహం వద్ద గుత్ప, అలీసాగర్ లిఫ్ట్ నిర్వహణ కాంట్రాక్ట్ కార్మికులు బుధవారం ధర్నాకు దిగారు. వేలాది ఎకరాలకు సాగునీరందించే ఎత్తిపోతల పథకాల్లో పనిచేసే తమకు ఐదు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే జీతాల బకాయిలు విడుదల చేయాలని, తమ సర్వీసులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. – నందిపేట్

## జలదోపిడీపై నిలదీత



సీతారామ ప్రాజెక్టు నీటిని మైదాన ప్రాంతాలకు తీసుకెళ్లి ఏజెన్సీ ప్రాంతాలకు అన్యాయం చేస్తారా? అంటూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో గిరిజనులు బుధవారం నిరసన తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం బద్దుతండాలో స్థానికులు 'మొదట ఏజెన్సీ ప్రాంతాలకే గోదావరి నీళ్లు ఇవ్వాలి' అనే కరపత్రాలను ప్రదర్శించారు. ముగ్గురు మంత్రులున్నా 'రోళ్లపాడు'కు అన్యాయం చేస్తారా? అని మండిపడ్డారు. – టేకులపల్లి

## బస్సు సర్వీసు కోసం నిరసన



తమ గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసును పునఃప్రారంభించాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి జిల్లా టేకులపల్లి మండలం రామచంద్రునిపేట పంచాయతీ పాతర్లగడ్డలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో బుధవారం గ్రామస్థులు నిరసన తెలిపారు. తమకు ఎంతో ఉపయోగకరంగా ఉండే 'బోడు' బస్సును తిరిగి ప్రారంభించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. – టేకులపల్లి

## సింగరేణి ఓసీ గనుల్లోకి భారీగా చేరిన నీరు

### రూ.కోటి వరకు నష్టం

భూపాలపల్లి రూరల్, జూలై 17 : జయశంకర్ భూపాలపల్లి జిల్లావ్యాప్తంగా మంగళవారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో సింగరేణి ఉపరితల (ఓసీ) బొగ్గు గనుల్లో భారీగా నీరు, మట్టి చేరి ఉత్పత్తికి అంతరాయం కలిగినట్టు అధికారులు తెలిపారు. భూపాలపల్లి ఓసీ-2, 3 గనుల్లో 6 వేల టన్నులు, తాడిచర్ల ఓసీలో 4 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగిందని చెప్పారు. సింగరేణికి దాదాపు రూ.కోటి వరకు నష్టం వాటిల్లిందని వారు పేర్కొన్నారు.

# వైద్యశాఖలో సీనియార్టీ లొల్లి?

- జాబితా తప్పుల తడకగా ఉన్నదని ఆరోపణలు
- నేటి నుంచి 'ఫిజికల్ కౌన్సెలింగ్'
- సీనియార్టీని చెక్ చేస్తారా?



హైదరాబాద్, జూలై 17 (నమస్తే తెలంగాణ): వైద్యశాఖలో గురువారం నుంచి బదిలీలు ప్రారంభం కానున్నాయి. ఆన్‌లైన్ అలాట్‌మెంట్ కాకుండా.. ఫిజికల్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. అయితే ఇప్పటివరకు ప్రకటించిన సీనియార్టీ జాబితాపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా పబ్లిక్ హెల్త్ విభాగంలో ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచిన సీనియార్టీ జాబితా పూర్తిగా తప్పులతడకగా ఉన్నదని కొన్నిరోజులుగా నర్సులు డీపీహెచ్ ఆఫీస్ ముందు ఆందోళన చేస్తున్నారు. పేర్లు, సీనియార్టీ, సర్వీస్ వంటి వివరాలు తప్పుగా నమోదయ్యాయని చెప్తున్నారు. సగం జాబితా తప్పుల తడకగా ఉన్నదని ఆరోపిస్తున్నారు. వాస్తవానికి సీనియార్టీ జాబితా ప్రకటించిన మొదటిరోజే భారీ స్థాయిలో తప్పులు దొర్లాయని నర్సులు చెప్తున్నారు. కొందరికి వందేండ్లకుపైగా సర్వీస్‌లో ఉన్నట్టు పడిందని అంటున్నారు. దీనిపై డీపీహెచ్ కార్యాలయం ముందు నిరసన తెలుపగా.. ఆ జాబితాను మార్చారని, కానీ రెండోసారి ప్రకటించిన జాబితాలోనూ ఇదే పునరావృతం అయ్యిందని తెలిపారు. మళ్లీ విమర్శలు రావడంతో ముచ్చటగా మూడోసారి కూడా సీనియార్టీ జాబితా మార్చారని అయినా తప్పులు పోలేదని చెప్పారు. మూడుసార్లు జాబితా మార్చినా తప్పులు కొనసాగడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

### పరిశీలించే వ్యవస్థ ఏది?

ఈ విషయంలో డీపీహెచ్ కార్యాలయంలోని కొందరు అవినీతి సిబ్బంది, యూనియన్ నేతల ప్రమేయం ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసే సమయంలోనే ఒకేచోట పనిచేసిన కాలాన్ని కావాలనే తక్కువ రాయించుకున్నట్టు సమాచారం. 'కౌన్సెలింగ్ సమయంలో మనల్ని ఎవరూ అడగరు. ఆన్‌లైన్‌లో మనం రాసిందే లెక్క. నిజమా? కాదా? అని పరిశీలించే వ్యవస్థే లేదు' అన్న భావనతో ఇష్టం వచ్చినట్టు సర్వీస్‌ను రాశారని అంటున్నారు. ఇది ఈ ఒక్క విభాగానికే పరిమితమా? మిగతా విభాగాల్లోనూ ఇలాగే జరిగిందా? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. వాస్తవానికి ఒక వ్యక్తి ఇచ్చిన వివరాలు నిజమో కాదో నిర్ధారించేందుకు వైద్యారోగ్య శాఖ ఇప్పటివరకు ఎలాంటి వ్యవస్థనూ ఏర్పాటు చేయలేదు. ఇదే అక్రమార్కులకు ఆసరాగా మారిందని, ఇదంతా పెద్ద కుంభకోణమనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా సర్వీస్‌ను నిర్ధారించే ఏర్పాట్లు చేయాలని, పారదర్శకంగా బదిలీలు జరపాలని కోరుతున్నారు.

### 317 అమలు చేయకుండా.. బదిలీలెలా?

వైద్యవిధాన పరిషత్తు (టీవీవీపీ) లోని జిల్లా క్యాడర్ ఉద్యోగులది విచిత్ర పరిస్థితి. టీవీవీపీ పరిధిలో మల్టీజోన్, జోనల్ స్థాయి పోస్టులకు 317 జీవో అమలు ప్రక్రియ పూర్తయినా.. జిల్లా క్యాడర్‌కు అమలు కాలేదు. ల్యాబ్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్స్, డ్రైవర్లు, జూనియర్ అసిస్టెంట్ వంటి 17 రకాల పోస్టులు ఉన్నాయి. దీంతో ప్రస్తుతం చేపడుతున్న సాధారణ బదిలీల్లో తమకు అవకాశం రావడం లేదని వాపోతున్నారు.

## బధిర విద్యార్థులకు అండగా స్కిల్‌సాఫ్ట్ ఇండియా

హైదరాబాద్, జూలై 17 (నమస్తే తెలంగాణ): నైపుణ్యాభివృద్ధి సంస్థ స్కిల్‌సాఫ్ట్ ఇండియా హైదరాబాద్ ఔదార్యాన్ని చాటుకుంది. మలక్‌పేటలోని బధిరుల ఆశ్రమ పాఠశాలలో మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించింది. సీఎస్సార్ నిధులతో డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ క్లాస్‌రూమ్‌లను ఏర్పాటు చేసింది. విద్యార్థులకు యూనిఫారాలు అందించడంతోపాటు, భవనం ఆధునీకీకరణ పనులు చేపట్టినట్టు స్కిల్‌సాఫ్ట్ ఉపాధ్యక్షుడు రామకృష్ణన్ తెలిపారు.

## రేపు ఐఐటీ మద్రాస్ స్నాతకోత్సవం

హైదరాబాద్, జూలై 17(నమస్తే తెలంగాణ):ఐఐటీ మద్రాస్ 61వ స్నాతకోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నారు. రసాయనశాస్త్రంలో నోబుల్ బహుమతి పొందిన బ్రియాన్ కే కొబికా ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు.

## సింగరేణి ఓసీపీ-2లో ప్రమాదం

- సైడ్‌వాల్ కూలి ఇద్దరు కార్మికుల దుర్మరణం
- మరో ఇద్దరికి గాయాలు
- ప్రమాదంపై కార్మిక సంఘాల కన్నెర్ర
- అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఫైర్




విద్యాసాగర్(ఫైల్), వెంకటేశ్వర్లు (ఫైల్)

రామగిరి, జూలై 17: సింగరేణిలో పండుగపూట ఘోర ప్రమాదం జరిగింది. రామగుండం-3 డివిజన్ పరిధిలోని ఓపెన్‌కాస్టు-2 (ఉపరితల గని)లో సైడ్‌వాల్ కూలి ఇద్దరు కార్మికులు మృతిచెందారు. పెద్దపల్లి జిల్లా సెంటినరీ కాలనీకి చెందిన ఉప్పుల వెంకటేశ్వర్లు ఫిట్టర్‌గా, ఇదే కాలనీకి చెందిన మాదం సమ్మయ్య, ఫైవ్ ఇంక్లెయిన్ కాలనీకి చెందిన గాదం విద్యాసాగర్, పెద్దపల్లికి చెందిన ఎర్రం శ్రీనివాస్‌రాజు ఓసీపీ-2 (ఉపరితల గని)లో జనరల్ మజ్దూర్లుగా పనిచేస్తున్నారు. మూడు రోజులుగా గనిలోని క్వారీలో హైవాల్ సంప్ వద్ద పైప్‌లైన్ మరమ్మతులు చేస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు సెకండ్ షిఫ్ట్ డ్యూటీకి హాజరయ్యారు. క్వారీ వద్ద పనులు చేస్తుండగా, ప్రమాదవశాత్తు సైడ్‌వాల్ కూలి మీద పడటంతో వెంకటేశ్వర్లు (58), విద్యాసాగర్ (34) అక్కడికక్కడే మృతిచెందారు. పక్కనే ఉన్న కార్మికులు శ్రీనివాసరాజు, సమ్మయ్యకు గాయాలు కాగా, వారిని సెంటినరీకాలనీ డిస్పెన్సరీలో చేర్పించారు. వెంకటేశ్వర్లు, విద్యాసాగర్ మృతదేహాలను గోదావరిఖని సింగరేణి ఏరియా దవాఖానకు తరలించారు. కాగా, డ్యూటీకి వెళ్లిన కొద్ది గంటలకే తమ ఇంటి పెద్దలు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు తల్లడిల్లారు. సింగరేణి సంస్థ డైరెక్టర్ జీవీ రెడ్డి ఇదే ఏరియాలో పర్యటించి భద్రతా చర్యలపై అధికారులతో సమీక్షించి వెళ్లిన కొద్ది గంటలకే ఈ ప్రమాదం జరగడం గమనార్హం.

### అధికారుల నిర్లక్ష్యంపై కార్మికుల కన్నెర్ర

ప్రమాదంపై కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు కన్నెర్ర చేశారు. ప్రతికూల పరిస్థితిలో వర్షంలోనూ పనులు చేయించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, ప్రమాదానికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో మరమ్మతులు చేయడం కష్టతరంగా ఉన్నదని ఉప్పు వెంకటేశ్వర్లు మూడు రోజులుగా చెప్తున్నా అధికారులు పట్టించుకోలేదని, పైగా పనిచేయాలని ఒత్తిడి చేసి మృతికి కారణమయ్యారని ఆరోపించారు. పని స్థలం వద్ద ఒక ఇంజినీర్, సూపర్‌వైజర్ ఉండి పనులు కొనసాగించాల్సి ఉండగా, అక్కడ ఎవరూ లేకపోవడం ఉన్నతాధికారుల నిర్లక్ష్యానికి అద్దంపడుతున్నదని మండిపడ్డారు.

## క్వారీ గుంతలో ఈతకు దిగి ముగ్గురు మృతి

### సూర్యాపేట జిల్లా బొప్పారంలో ఘటన





రాజు, శ్రీపాల్‌రెడ్డి, ఉషాంక (ఫైల్)

ఆత్మకూర్(ఎస్), జూలై 17: క్వారీ గుంతలో మునిగి ముగ్గురు మృత్యువాతపడ్డారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండలం బొప్పారంలో చోటుచేసుకున్నది. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం జూపెడకు చెందిన తిప్పారెడ్డి శ్రీపాల్‌రెడ్డి (40) ఏపీలోని నరసరావుపేటకు చెందిన తన స్నేహితుడు చామల రాజు కుటుంబంతో కలిసి అత్తగారి ఊరైన బొప్పారం గ్రామానికి రెండ్రోజుల క్రితం వచ్చారు. బుధవారం ఉదయం పల్లె అందాలను చూద్దామని శ్రీపాల్‌రెడ్డి, ఆయన పెద్ద కుమారుడు చేతన్‌రెడ్డి, రాజు, ఆయన ఇద్దరు కూతుర్లు ఉషాంక (12), రిషిక, శ్రీపాల్‌రెడ్డి వదిన కూతురు వర్షిత కలిసి బయటకు వెళ్లారు. శ్రీపాల్‌రెడ్డి మామ ఉపేందర్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రం వద్దకు వెళ్లివస్తూ చెరువు సమీపంలో ఉన్న క్వారీని చూసి ఆగారు. క్వారీలో నీళ్లు కనిపించడంతో సరదాగా ఈత కొడుదామనుకున్నారు. చేతన్‌రెడ్డి నీళ్ల లోతు చూసి బయటకు వచ్చేలోపే రాజు, ఆయన పెద్ద కూతురు ఉషాంక నీటిలోకి దిగ గా జారి పడి లోపలికి వెళ్లిపోయా రు. వారిని కాపాడే ప్రయత్నం లో శ్రీపాల్‌రెడ్డి కూడా నీటిలో మునిగాడు. అదే సమయంలో రాజు చిన్న కూతురు రితిక కూడా నీళ్లలోకి జారింది. చేతన్‌రెడ్డి రితికను మాత్రం బయటకు తీసుకురాగలిగాడు. అప్పటికే రాజు, ఉషాంక, శ్రీపాల్‌రెడ్డి పూర్తిగా నీటిలో మునిగిపోయారు. స్థానికులు వచ్చేసరికి శ్రీపాల్‌రెడ్డి, రాజు, ఉషాంక ప్రాణాలు వదిలారు. శ్రీపాల్‌రెడ్డి ఖమ్మంలో బిల్డర్‌గా, రాజు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు.ఈ ఘటనతో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొన్నది.

## జూరాలకు మొదలైన వరద

### తుంగభద్రకు 71,682 క్యూసెక్కులు

ధరూరు/అయిజ, జూలై 17 : జూరాలకు వరద మొదలైంది. బుధవారం కర్ణాటకలోని నారాయణ్‌పూర్ డ్యాం 12 గేట్లను తెరిచి దిగువకు 37,260 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో జూరాల ప్రాజెక్టుకు 2,500 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో నమోదైంది. డ్యాం పూర్తిస్థాయి సామర్థ్యం 9.657 టీఎంసీలకుగాను ప్రస్తుతం 3.956 టీఎంసీలు ఉన్నట్టు అధికారులు తెలిపారు. తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో 71,682 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 293 క్యూసెక్కులుగా నమోదైంది. గరిష్ఠ నీటినిల్వ 105.788 టీఎంసీలకుగాను ప్రస్తుతం 41 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.

### మేడిగడ్డ బరాజ్‌కు భారీగా వరద

మహదేవపూర్/కాళేశ్వరం/కన్నాయిగూడెం/చర్ల: జూలై 17 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మేడిగడ్డ (లక్ష్మి) బరాజ్‌కు ఎగువ నుంచి భారీగా వరద వస్తున్నది. ఎగువన ఉన్న మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో ప్రాణహిత నది ద్వారా బుధవారం 49,500 క్యూసెక్కుల వరద రాగా, బరాజ్‌లోని మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో నీటిని దిగువకు వదులుతున్నారు.

### సమ్మక్క బరాజ్ వద్ద పెరుగుతున్న గోదావరి

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం సమ్మక్క బరాజ్‌కు బుధవారం ఎగువ నుంచి 86,630 క్యూసెక్కుల వరద వస్తుండటంతో నీటిమట్టం 74.50 మీటర్ల ఎత్తుకు చేరుకున్నది.

### తాలిపేరు ప్రాజెక్టుకు..

ఎగువన నుంచి భద్రాద్రి జిల్లాలోని తాలిపేరు ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చి చేరుతున్నది. మొత్తం 25 గేట్లు ఎత్తి 70.75 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు.

